క్లుప్తంగా

శాలివాహన జయంత్యుత్సవం



రెంటచింతల: రెంటచింతలలో ఆంధ్రుల ప్రప్రథమ చక్రవర్తి శాలివాహనుడి జయంత్యుత్సవం బుధవారం నిర్వహించారు. సర్పంచ్ పూజల పుష్పావతిరామయ్య శాలివాహనుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఆంధ్రులను ఏకతాటిపైకి తీసుకువచ్చి సుపరిపాలన అందించిన చక్రవర్తిగా ఆయన పేరుపొందారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు పూజల రామయ్య, కన్నెగంటి హనుమంతు సేవా సంఘం సభ్యులు నారాయణపురం శ్రీనివాసరావు, పూజల వెంకటేష్, వైఎస్సార్ సీపీ నాయకులు దేగల సంసోన్, దావులూరి ప్రభాకర్, చిన్నా, అంజి తదితరులు పాల్గొన్నారు.

25న వేలంపాట

దాచేపల్లి : స్థానిక పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఈ నెల 25న వేలం పాట నిర్వహిస్తున్నట్లు సీఐ షేక్ బిలాలుద్దీన్ బుధవారం తెలిపారు. మద్యం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన లారీ, పాల వాహనాలు, ఆటోలు ద్విచక్రవాహనాలు వేలం వేస్తున్నామని, ఆసక్తి ఉన్న వ్యక్తులు ఈ వేలంలో పాల్గొనవచ్చునని సీఐ చెప్పారు.

కొత్త కారుతో హల్‌చల్

దెబ్బతిన్న ఆరు ద్విచక్రవాహనాలు

మాచర్ల: ఉగాది పండగ రోజున కొత్త కారు కొన్న ఓ వ్యక్తి అంబేడ్కర్ సెంటర్‌లో హల్‌చల్ చేశాడు. ఇష్టానుసారం డ్రైవింగ్ చేయడంతో ఆరు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. ఓ చిన్నారి, వ్యక్తి ఇబ్బందికి గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేశారు. వాహనాలు దెబ్బతినడానికి కారణమైన వ్యక్తిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్ళగా తాను కొత్తగా వాహనం కొనుగోలు చేసి వెళ్తున్న సమయంలో మొదటి వాహనానికి కారు తగిలి మిగిలిన వాహనాలు కింద పడ్డాయని చెప్పాడు. ఈ విషయమై ఇరువర్గాలను విచారించి ద్విచక్ర వాహనాలు దెబ్బతినడానికి కారణమైన వ్యక్తి ద్వారా బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

గురజాల: అప్పుల బాధ తాళలేక కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గోట్టిముక్కల గ్రామానికి చెందిన సాగి కోటేశ్వరరావు రైతు. అప్పులపాలై వడ్డీలు కట్టలేక సతమతమవుతున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున పొలానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. బల్లిగుడ్ల వాగు వద్ద ముళ్ల చెట్టుకు కోటేశ్వరరావు ఉరి వేసుకున్న విషయాన్ని మేకల కాపరులు గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. కోటేశ్వరరావు భార్య చెన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన



మాచవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలుగన్న సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమైందని జెడ్పీటీసీ జె.శివాయాదవ్ చెప్పారు. మాచవరం అంబేడ్కర్ కాలనీలో గ్రామ సర్పంచ్ రాగిడి నరేష్ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సింగరయ్య, మాజీ యూత్ కన్వీనర్ జిలుగు వెంకట నరసింహారెడ్డి, రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు షేక్ అల్లాభక్షు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ వంకాయల రమేష్, ఎంపీటీసీ మద్దు అనురాధ కృష్ణాంజినేయులు, షెడ్స్ సంస్థ డైరెక్టర్ మద్దు కోటేశ్వరావు, పాస్టర్ పిలిఫ్‌బాబు, చిలకా కోటేశ్వరరావు, కుర్రా రామారావు, డేవిడ్, వై.రామారావు, సురేష్, లైమన్, శ్రీకాంత్, కోటి, మనోహర్, ప్రకాష్, పాలు, సాగర్, రోశిబాబు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించిందని కుమారుడు ఆత్మహత్య

యడ్లపాడు: తల్లి మందలించిందని ఆత్మహత్యకు పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మైదవోలుకు చెందిన పచ్చల వేళంగిణి రాజు దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో చిన్నవాడైన పచ్చల మాధవ మంగళవారం ఉదయం మద్యం సేవించి ఇంటికి రావడంతో గమనించి, ఇవేం పనులంటూ తల్లి మందలించింది. మత్తులో ఉన్న మాధవ (18) ఆవేశంతో ఇంటికి మద్యం తెచ్చుకుని అందులో పురుగుల మందు కలుపుకుని తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి గుంటూరు సమగ్ర ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు యడ్లపాడు ఎస్ఐ పైడి రాంబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శోభ సౌభాగ్యం

- అట్టహాసంగా ఉగాది వేడుకలు
- సంప్రదాయబద్ధంగా పంచాంగ శ్రవణాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మాచర్ల/మాచర్ల రూరల్/గురజాల/దాచేపల్లి/మాచవరం/పిడుగురాళ్ల/పిడుగురాళ్ల రూరల్/రెంటచింతల/దుర్గి: మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో బుధవారం శోభకృత్ నామ ఉగాది పర్వదినాన్ని ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పంచాంగ శ్రవణాల్లో పాలుపంచుకున్నారు.

● గురజాలలోని సీతారామాలయం, జంగమహేశ్వరపురంలోని లక్ష్మీనరసింహ ఆలయాల్లో ఉగాది వేడుకలు నిర్వహించారు. పంచాంగ శ్రవణంలో భక్తులు పాల్గొన్నారు. పలు ఆలయాల వద్ద షడ్రుచుల పచ్చడిని పంపిణీ చేశారు. ఉగాది సందర్భంగా చర్లగుడిపాడు గ్రామంలో స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి గ్రామ, పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో సీతారామాలయం కమిటీ చైర్మన్ కందుల సాంబశివరావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● దాచేపల్లిలోని రంగనాయకస్వామి ఆలయం, వీర్ల అంకమ్మతల్లి దేవాలయం, నడికుడిలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. బొడ్రాయి సెంటర్, నడికుడి వార్డు సచివాలయం వద్ద పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మందపాటి రమేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ, మాజీ చైర్మన్ మునగా పున్నారావు ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు.

● మాచవరం మండలంలోని అన్ని ఆలయాల్లో ఉగాది వేడుకలు అట్టహాసంగా జరిగాయి.

● పిడుగురాళ్ల పట్టణంలోని వాసవీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం మహిళల కూచిపూడి నాట్య ప్రదర్శన అలరించింది. పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంతోపాటు పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం జరిగింది. పిడుగురాళ్లలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు పాల్గొన్నారు. ఉచితంగా ఉగాది పచ్చడి, దద్దోజనం పంపిణీ చేశారు.

● పిడుగురాళ్ల రూరల్ మండలంలోని కామేపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామ శివారులోని కాలవగట్టుపై వేంచేసి ఉన్న శివనాగేంద్రస్వామి ఆలయంలో మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శివనాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

● రెంటచింతలలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంతోపాటు పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం జరిగింది. ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, సర్పంచ్ పూజల పుష్పావతిరామయ్య, వాసవీ అమ్మవారి దేవస్థానం చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● దుర్గి మండలంలో ఉగాది సంప్రదాయబద్ధంగా జరిగింది. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు పంచాంగ శ్రవణాలు జరిగాయి. రైతులు తమ ఎడ్లను ప్రత్యేకంగా అలంకరించి పొలాల్లో సేద్యం కోసం పూజలు చేశారు. పలు గ్రామాలలో ప్రజలు తమ పూర్వీకుల సమాధులను సందర్శించి కొబ్బరి కాయలు కొట్టి పూలదండలు వేసి నివాళులర్పించారు.

● మాచర్ల రూరల్ మండలం కొత్తపల్లి రామాలయంలో పంచాంగ శ్రవణం జరిగింది. ఈ సందర్భంగా పండితులను గ్రామస్తులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, తేళ్ళూరి శంకర్‌రెడ్డి, వీరంశెట్టి ఆదినారాయణ, సత్యనారాయణరెడ్డి, ఆరికట్ల పున్నారెడ్డి, కోటిరెడ్డి, మేడం భాస్కర్‌రావు, సుబ్బయ్యాచారి, హనిమిరెడ్డి, కొండలు, బాలిరెడ్డి, జయభారత్‌రెడ్డి పాల్గొన్నారు.

● కారెంపూడి మండలంలో ఉగాది సంబరాలు అంబరాన్నంటాయి. చెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం రాత్రి పంచాంగ పఠనం జరిగింది. పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్‌చెన్నకేశవ, ఆలయ ధర్మకర్త చల్లా ప్రసాద్, ఈవో కృష్ణంరాజుతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు. కారెంపూడి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉగాది వేడుకలు జరిగాయి.



కారెంపూడి చెన్నకేశవస్వామి ఆలయంలో పంచాంగం పఠనం



దుర్గిలో పంచాంగ శ్రవణం



పిడుగురాళ్లలో వాసవీ అమ్మవారి ప్రత్యేక అలంకరణ



రెంటచింతలలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి దంపతులు



మాచర్లలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులు



దాచేపల్లిలో పంచాంగ శ్రవణం



మాచవరం మండలం పిన్నెల్లి శివాలయం వద్ద పంచాంగ శ్రవణం



గురజాల మండలం చర్లగుడిపాడులో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



మాచర్ల రూరల్ కొత్తపల్లిలో పండితులకు సన్మానం



పిడుగురాళ్లలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

పల్నాడు అభివృద్ధి ప్రదాత బ్రహ్మానందరెడ్డి

మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి



కాసు బ్రహ్మానందరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి

గురజాల : పల్నాడు ప్రాంత అభివృద్ధి ప్రదాత కాసు బ్రహ్మానందరెడ్డి అని మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి అన్నారు. నగర పంచాయతీలోని బస్టాండ్ వద్ద గల కాసు బ్రహ్మానందరెడ్డి విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. పల్నాడు ప్రాంతంలో అభివృద్ధికి పునాది వేసిన నాయకుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, గురజాల-దాచేపల్లి మార్కెట్ యార్డు డైరెక్టర్ కె.అంద్రెయ్య, మాజీ ఎంపీపీ వీరంరెడ్డి అమరారెడ్డి, పాశం హనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బి.ఇష్టకామిరెడ్డి , కో-ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్‌అహ్మద్, కనకం ఆదినారాయణ దత్తు, పోలా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు ఉగాది పురస్కారం



మంత్రి అంబటి నుంచి ఉగాది పురస్కారం అందుకుంటున్న రవికుమార్

దాచేపల్లి : స్థానిక ఎస్టీ కాలనీ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కొసూరి రవికుమార్ ప్రభుత్వ ఉగాది పురస్కారాన్ని బుధవారం అందుకున్నారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఉగాది వేడుకల్లో మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా రవికుమార్ ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. రవికుమార్ మాట్లాడుతూ.. సాహిత్యరంగంలో తన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఉగాది పురస్కారం అందించటం సంతోషంగా ఉందన్నారు. గతంలో తనకు వచ్చిన పురస్కారాలు, సన్మానాలకంటే ప్రభుత్వ ఉగాది పురస్కారం మైలురాయి వంటిదని పేర్కొన్నారు.

విద్య ఎంతో అవసరం

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు



పాఠశాల భవనానికి శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తదితరులు

పిడుగురాళ్ల: భవిత బాగుండాలంటే విద్య ఎంతో అవసరమని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు చెప్పారు. పట్టణంలోని 23వ వార్డులో మండల ప్రజాపరిషత్ పాఠశాల కొత్త భవనం శంకుస్థాపన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కొత్త వెంకట సుబ్బారావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనబడి నాడు-నేడు ద్వారా పాఠశాలలను అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నారని, ఉచితంగా యూనిఫాం, నోట్ పుస్తకాలు అందిస్తున్నారని, పిల్లలను బడికి పంపిస్తే చాలు రూ.15 వేలు తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారని, విద్యకు పెద్దపీట వేసి పేదవర్గాలకు కార్పొరేట్ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీ రంగ రజని, మాదాల కిరణ్‌కుమార్, షేక్ అబ్దుల్లా, గర్నె నాగేశ్వరరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ పంతంగి అమర్, అధ్యాపకులు రత్నకుమారి, వెంకటేశ్వర్లు, హెప్సిబా, బత్తుల వెంకటేశ్వర్లు, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టు ప్రారంభం



చెక్ పోస్టును ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు కొమెర వెంకటేశ్వర్లు

పిడుగురాళ్లరూరల్: వ్యవసాయ మార్కెట్ యార్డు చెక్ పోస్టుల ద్వారా వచ్చే ఆదాయంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పిడుగురాళ్ల వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కొమెర మంగమ్మ, వెంకటేశ్వర్లు చెప్పారు. మండలంలోని జూలకల్లు, గుత్తికొండ గ్రామాల అడ్డరోడ్డు వద్ద వ్యవసాయ మార్కెట్ చెక్ పోస్టును ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పిడుగురాళ్ల మార్కెట్ యార్డు పరిధిలో జానపాడు, కొండమోడు వద్ద రెండు చెక్ పోస్టులు ఉన్నాయని, మూడవది జూలకల్లు అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు కార్యదర్శి కె.ఈశ్వరరావు, పల్నాడు జిల్లా అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, డైరెక్టర్లు సి.రేవతి, వెంకాయమ్మ, పందిటి వెంకటేశ్వరరెడ్డి, రత్నాకర్, మార్కెట్ యార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే కార్యకర్తలకు న్యాయం

వక్ఫ్‌బోర్డు చైర్మన్ అక్బర్ జానీబాషా



అక్బర్‌ను సన్మానిస్తున్న అంబేడ్కర్ సేవా సంఘం నాయకులు

కారెంపూడి: కష్టపడి పనిచేసే కార్యకర్తలకు న్యాయం చేయడంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ముందుంటారని పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అక్బర్ జానీబాషా చెప్పారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన అక్బర్‌ను సన్మానించారు. అక్బర్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పేదల పార్టీ అని కొనియాడారు. అనంతరం డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ షేక్ షఫీ, సర్పంచ్ రమావతు తేజానాయక్, మర్రి శేషయ్య, కాలె రాంబాబు, నూకాబత్తిన సాంబయ్య, కాలె మల్లేశ్వరరావు, మాలపాటి వెంకటేశ్వర్లు, కాలె శివ, మైలా ఆనందరావు, యర్రం సతీష్, కోట శ్రీను, కాలె చెన్నయ్య, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు అంబేడ్కర్



భూమిపూజ చేస్తున్న హనిమిరెడ్డి

పాలువాయి(రెంటచింతల): సమాజంలోని అసమానతలు, పెత్తందార్ల దురహంకారంపై అలుపెరగని పోరాటం చేసిన యోధుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ నాయకులు మండలపు హనిమిరెడ్డి చెప్పారు. బుధవారం మండలంలోని పాలువాయి గ్రామంలో జై భీమ్ అభ్యుదయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత, సంఘ సంస్కర్త, కుల నిర్మూలన కోసం ఎంతో కృషి చేసిన మహనీయుడైన అంబేడ్కర్ విగ్రహం గ్రామంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శొంఠిరెడ్డి నాగమ్మనర్శిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు తేలుకుట్ల కోటిరెడ్డి, సీపీఐ ఎంఎల్ ప్రజాపోరు నాయకులు పాటిబండ్ల కోటేశ్వరరావు, గ్రామ పెద్దలు వట్టి రామిరెడ్డి, భీమవరపు శ్రీనివాసరావు, గొడుగు అయ్యప్ప, కమిటీ అధ్యక్షులు దాసరి బుజ్జి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, నేనావత్ బాబూనాయక్, భగవాన్ దాసు, చినలోకయ్య, భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పెదకూరపాడు: బాలిక అదృశ్యంపై బుధవారం పెదకూరపాడు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ బీవీ కృష్ణారావు కథనం ప్రకారం.. బెల్లంకొండ మండలం రామాంజినేయపురం గ్రామానికి చెందిన ఉల్లిగడ్డల జయమ్మ, చిన్నకోటయ్యల 17 ఏళ్ల కుమార్తె గత ఏడాది పదో తరగతి బెల్లంకొండలో చదివి ఉత్తీర్ణత సాధించలేదు. ఈ నేపథ్యంలో నెల రోజుల క్రితం పెదకూరపాడు మండలం 75త్యాళ్ళూరు గ్రామానికి చెందిన పెద్దమ్మ మేడా లక్ష్మి ఇంటికి వచ్చింది. ఈ నెల 19న రాత్రి నుంచి ఆమె కనపడడం లేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అచంచల భక్తితో అలుపెరగ'కొండ'



బారులు తీరిన భక్తులు

రాజుపాలెం: ఉగాది పండగ సందర్భంగా దేవరంపాడు కొండకు భక్తులు పోటెత్తారు. పల్నాడు తిరుపతిగా పేరుగాంచిన దేవరంపాడు కొండపై మత్స్య రూపంలో వెలసిన నేతి వెంకన్న స్వామిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే అచంచల భక్తితో అలుపెరగకుండా బారులు తీరారు. ఫలితంగా గోవింద నామస్మరణతో కొండ మార్మోగింది. భక్తులు స్వామికి పొంగళ్లు చేసి, నెయ్యి, బెల్లం, పప్పు వగైరాలు సమర్పించారు. తమను కాపాడాలని స్వామికి నెయ్యిని సమర్పించి మొక్కుకున్నారు. ఆలయంలో ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు.

మంచినీటి బోరు ప్రారంభం



నాగులవరంలోని బ్రహ్మంగారి గుడి కాలనీలో మంచి నీటి బోరును ప్రారంభిస్తున్న ఎంపీపీ బూడిద శ్రీను

విజయపురిసౌత్: మాచర్ల మండలం నాగులవరం గ్రామంలో బుధవారం ఎంపీపీ బూడిద శ్రీను కొత్త తాగునీటి బోరును కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి గ్రామంలోని బ్రహ్మంగారి గుడి కాలనీలో తాగునీటి సమస్య గురించి తెలుసుకుని తక్షణమే కొత్త బోరును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం కావటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా గొర్రెల పెంపకందారుల యూనియన్ చైర్మన్ బూడిద సైదులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు ప్రభుత్వం కృషి



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

దాచేపల్లి : విద్యార్థుల ఉజ్వల భవితకు ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి చెప్పారు. ముత్యాలంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని ముత్యాలంపాడు ఆరిజన్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కేక్‌ను కట్ చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను అందంగా తీర్చిదిద్దుతున్నారని గుర్తుచేశారు. విద్యావ్యవస్థ బలోపేతానికి రూ.వేలకోట్లు ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. ముత్యాలంపాడు హైస్కూల్ అభివృద్ధికి చారిటబుల్ ట్రస్ట్ సహకారం అందించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెదహనిమిరెడ్డి, సర్పంచ్ శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ వెంకటచారి, ఎంపీటీసీ పోస వెంకటనాగయ్య, ట్రస్ట్ సభ్యులు యరవెద గురవారెడ్డి, కొప్పుల గురవారెడ్డి, దొండేటి సీతారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ ఏసుబాబు, ప్రధానోపాధ్యాయుడు లంకె వాసుదేవరావు, ఉపాధ్యాయులు బళ్లా శ్యాంకుమారి, గుదిబండి శ్రీనివాసరెడ్డి, ఆడేపు రాజేష్, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.